క్లుప్తంగా

ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నేరడిగొండ: ఫిబ్రవరి 1 నుంచి 5వరకు ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శభాన తరన్నుమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్ బోర్డు నిర్వహించే పరీక్షకు సంబంధించి హాల్ టిక్కెట్ల కోసం విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సమాజ సేవ అభినందనీయం



దుర్గం శేఖర్‌ను సన్మానిస్తున్న మీరాబాయి

ఆదిలాబాద్‌టౌన్: దుర్గం ట్రస్ట్ ద్వారా సమాజ సేవ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు బత్తుల మీరాబాయి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దుర్గం ట్రస్ట్ కార్యాలయంలో చైర్మన్ దుర్గం శేఖర్ కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గైక్వాడ్ ధమ్మానంద్, బాపురావు, బాబారావు, ఆశ సానాలే, సులోచన, సీమ, సుమన్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నర్సింగ్‌లో ఉద్యోగం సాధించిన యువకుడు



ఎల్టి రాకేశ్

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామానికి చెందిన యువకుడు ఎల్టి రాకేశ్ నర్సింగ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. ఆది వారం విడుదలైన ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో నర్సింగ్‌గా ఉద్యోగం సాధించాడు. కూలీ కుటుంబానికి చెందిన యువకుడు ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: సంగెం చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న అన్నదానం ఆదివారంతో 149 వారాలకు చేరుకుంది. ఆదివారం ఆదిలాబాద్ బస్టాండ్ ప్రాంతంలో అన్నదానం నిర్వహించారు. ఆదిలాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సంజయ్ కుమార్ అన్నదానానికి సహకరించారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు స్టేనోగ్రాఫర్ మల్లారెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య, గణేష్ పాల్గొన్నారు.

తరగతులకు హాజరు కావాలి



హాజరైన అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకున్న పీజీ, డిగ్రీ అభ్యర్థులు రెండో శనివారం, ఆదివారం క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రతాప్ సింగ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఆదివారం, రెండో శనివారం తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ ఆదిలాబాద్ బ్రాంచ్ కౌన్సిలర్స్ ఆర్.గుండయ్య, కొత్త శ్రీనివాస్, అజయ్, హన్మాండ్లు, అన్సార్, శంషీర్ అలీ, అనిల్, ఆర్.శ్రీనివాస్, హరిదాస్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న చాకటి కిరణ్

ఆదిలాబాద్‌రూరల్: అభినవ సర్దార్ కేతావత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ నాయకులు చాకటి కిరణ్ ఆదివారం మావల మండలంలోని వాఘాపూర్‌లో దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉన్నందున నిరుపేద ఆదివాసీలకు దుప్పట్లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సదల్‌పూర్ జాతరకు వేళాయె

- ఫిబ్రవరి 3 నుంచి జంగీ జాతర
- భైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకంతో ప్రారంభం
- 9న కాలదహి హండీతో ముగింపు



భైరందేవ్ ఆలయం



మహాదేవ్ ఆలయం

బేల: ప్రతి ఏటా పుష్యమాసంలో వారం రోజుల పాటు నిర్వహించే జంగీ జాతర ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానుంది. పుష్యమాసం నవమి రోజున ఆలయాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. వారం రోజుల పాటు కొనసాగించి, అమవాస్య రోజు కాలదహీ హండీ నిర్వహించి జాతరను ముగిస్తారు. కాగా ఈ జాతర ఆదివాసీ పూర్వీకుల సాంప్రదాయబద్ధంగా 55 ఏళ్ల నుంచి నిర్వహిస్తుండగా.. గత 30 ఏళ్ల నుంచి దర్బార్ సభ నిర్వహిస్తున్నారు.

ఆలయాల ప్రత్యేకత..

ఆదివాసీల ఆరాధ్య దైవం భైరందేవ్, మహాదేవ్ ఆలయాలు శాతవాహనుల కాలంలో నల్లరాతితో నిర్మించబడి, అందమైన శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. మనసులో ఏదైనా కోరుకొని భైరందేవ్ ఆలయంలోని లింగాన్ని ఎత్తితే, అనుకున్నది జరుగుతది అనుకుంటే లింగం తేలికగా లేస్తుందని భక్తులు నమ్మకం. ఈ ఆలయాలకు ఆదివాసీలే కాకుండా జైనథ్, నార్నూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్, ఉట్నూర్ మండలాలతో పాటు మహారాష్ట్రలోని ప్రాంతాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు. ఆలయాలు అటవీకి సమీపాన ఉండి, ఆనాధిగా ఆదివాసీలు జాతర కొనసాగించడంతోనే జంగీ జాతర అని పిలుస్తుంటారు.

జాతర షెడ్యూల్ ఇలా..

ఫిబ్రవరి 3న జాతర ప్రారంభం కానుంది. 4 నుంచి కబడ్డీ పోటీలు, 6న ఆదివాసీ దర్బార్ సభ, 9న కాలదహీ హండీతో జాతర ముగింపు ఉండనుందని ఆలయ కమిటీ వారు తెలిపారు.

ప్రారంభం కానున్న ఏర్పాట్లు..

జాతర వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు ఆలయకమిటీ సభ్యులు ఏర్పాటు చేయనున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. క్యూలైన్ కోసం, భక్తుల రద్దీ నియంత్రించేందుకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక జాలీ ఏర్పాటు చేయనున్నారు. తాగునీటి సౌకర్యం, జాతర చుట్టూ ప్రాంతాల్లో విద్యుదీకరణ ఏర్పాట్లు చేయనున్నారు.

మారని ఆలయాల రూపురేఖలు..

ఈ ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆలయాల మరమ్మతు నిర్మాణ పనుల అభివృద్ధి కోసం కమిటీ వారు గత 12ఏళ్ల క్రితం దేవదాయ శాఖ అధికారులకు విన్నవించారు. అధికారులు సైతం వచ్చి చూసి వెళ్తున్నారు. ఆరు నెలల క్రితం ఆలయాలను పరిశీలించినప్పటికీ అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. భైరందేవ్ ఆలయ శిఖర భాగం ఒక్కొరాయి కూలుతుందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భక్తులు భయాందోళన చెందుతున్నారు. మరోపక్క మహాదేవ్ ఆలయం లోపల వర్షానికి ఊరుస్తుండడంతో పలువురు భక్తులు ప్రత్యేక చొరవతో గతేడాది ఆలయం పైభాగానికి మరమ్మతులు చేయించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే కందులు విక్రయించాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

తాంసి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంటలను విక్రయించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతులు తీసుకువచ్చిన కంది పంటను పరిశీలించి, మొదటి రైతు విఠల్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులకు పంటలను విక్రయించి నష్టపోవద్దని కోరారు. అనంతరం వివిధ కుల సంఘాల భవన నిర్మాణ పనులు ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, సొసైటీ సీఈవో కేశవ్, ఏవో రవీందర్, మార్కెట్ డైరెక్టర్‌లు చందర్ రెడ్డి, మహేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, రజనీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాకేష్‌యాదవ్, శ్రీధర్ రెడ్డి, కృష్ణ, సదానంద్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పంట అమ్మకంలో రైతులు మోసపోకుండా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామపటేల్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, మీర్జా జిలానిబేగ్, ముఖడే ఉత్తం, మహ్మద్ మసుద్, జహీర్, ధరంసింగ్, సిబ్బంది తుమ్మల సునీల్, సురేశ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ సలావొద్దీన్ ఆదివారం తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ద్వారా అవకాశం కల్పించడం జరుగుతుందని, స్లాట్ బుక్ చేసుకోవడానికి ఫిబ్రవరి, మార్చి రెండు నెలలు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండలస్థాయి అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని నర్సాపూర్ (బి) పంచాయతీ పరిధిలోని గొట్టి గోండుగూడలో బీటీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అంతకు ముందు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదలకు మెరుగైన విద్య, వైద్యం, నీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, మండల అధ్యక్షుడు ఖయ్యుం, సీనియర్ నాయకులు శేషరావు, జగదీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఇంద్రవెల్లి: మండలంలోని దోడందా గ్రామపంచాయతీ పరిధిలోని జంగుస్‌భూయరి దేవస్థానంలో ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. జంగుస్ భూయరి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని చిలటిగూడ, దోడందా, గట్టెపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామస్తులు సంప్రదాయ వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తుంరం నాగోరావ్, కుమ్ర మోహన్‌రావ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పవార్ దుదిరాం, సోమోరే నాగోరావ్, మహ్మద్ జహీర్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న భరత్ చౌహాన్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం అన్నిరంగాల్లో వెనుకబడి ఉందని ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని ఆయా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. గతంలో ఉన్న రాజకీయ నాయకులు పట్టించుకోకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. ఇప్పటికైన ఆదిలాబాద్ నుంచి కాగజ్‌నగర్, లేదా మంచిర్యాల వరకు రైల్వే లైన్ సర్వే చేసి ఉట్నూర్ ప్రాంతానికి రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, డెంటల్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ అయినా మంజూరు చేయాలన్నారు. సోమవారం ఐటీడీఏ పీవోను కలిసి వినతి అందిస్తామన్నారు. ఫిబ్రవరి 2న కేస్లాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున జిల్లాలోని ఎమ్మెల్యేలకు, ఎంపీటీలకు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. డిమాండ్ల సాధన కోసం తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా భరత చౌహాన్, కో కన్వీనర్లుగా బానోత్ రామారావు, నేతావత్ రాందాస్, ఆత్రం భుజంరరావు, ముడుగు శామ్యూల్, బానోత్‌జగన్, గణేశ్, చంద్రకాంత్, సుధాకర్, వేషరావులను ఎన్నుకున్నారు.

యువత క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: యువత క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో ఆదివారం క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యువత క్రీడాస్ఫూర్తిని కొనసాగిస్తూనే విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు వెళ్లాలని సూచించారు. పోటీ ప్రపంచంలో క్రీడలతో పాటుగా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, గాడ్గే సుభాష్, నర్వడే రమేశ్, కేశవపట్నం ఎంపీటీసీ అల్తాఫ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేరడిగొండ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు కొదువ లేదని, ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వాగ్ధారి గ్రామంలో యువ మిత్ర యూత్ మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలను సందర్శించారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్



టాలెంట్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నలంద జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పేపర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫైనల్ పరీక్షకు సన్నద్ధం చేసేలా టీఏవీఎస్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పరీక్ష రాసేందుకు 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు పూసం సచిన్, విజయ్ బాబు, జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, రవీందర్ రెడ్డి, రాహుల్, లంక రాఘవులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామంలోని ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పదో తరగతి మోడల్ పరీక్షను ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నాయకులు కుంరం దీపక్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షల విషయంలో భయం పోగొట్టేందుకు ఈ మోడల్ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం సభ్యులు కోటేశ్వర్, రాజేందర్, జైరాం పాల్గొన్నారు.

ఘనంగా కంకాలమ్మ, కేతేశ్వరస్వామి జాతర



పూజలు చేస్తున్న జాన్సన్ నాయక్



జాతరకు హాజరైన మంచిర్యాల డీసీపీ, ఏసీపీలు

జన్నారం: మండలంలోని ఈర్లగుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. మహేంద్ర సంఘం సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. మండలంతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు జాతరకు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొనకల్ ఎంపీటీసీ గుండవరం హరిణి, మధుసూధన్‌రావు దంపతులు అన్నదానం చేశారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, సర్పంచ్ భూమేశ్ తదితరులు హాజరై పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, సభ్యులు రాజన్న, కనకయ్య, అశోక్, మల్లయ్య, తదితరులు జాతర ఏర్పాట్లను పరిశీలించారు.

నిర్మాణానికి నోచుకోని సర్వీస్‌రోడ్లు

- ఇబ్బంది పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



సిరిచెల్మ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నిర్మాణానికి నోచుకోని సర్వీస్ రోడ్డు

ఇచ్చోడ: జాతీయ రహదారికి అనుకొని ఉన్న గ్రామాల ప్రజలు సర్వీస్ రోడ్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారి నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా.. సర్వీసు రోడ్లు నిర్మించే దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో జాతీయ రోడ్డు పక్కన్న ఉన్న గ్రామాల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పలుచోట్ల వాహనదారులు రాంగ్ రూట్లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా కూడా అధికారులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇచ్చోడలో..

మండల కేంద్రంలో సిరిచెల్మ ఫ్లైఓవర్ వంతెన వద్ద సర్వీసు రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. దీంతో కాలనీవాసులు, రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు గత కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. సిరిచెల్మ ఫ్లైఓవర్ వంతెన దూబార్‌పెట్ వద్ద గత రెండేళ్ల కిందట సర్వీసు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించి వదిలేశారు.

గుడిహత్నూర్‌లో..

గుడిహత్నూర్ మండల కేంద్రంలో జాతీహ రహదారి పక్కనే ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లే దారిలో సర్వీసు రోడ్డు నిర్మించకపోవడంతో గత కొన్నేళ్ల నుంచి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో విద్యార్థులు బురదల నుంచి పాఠశాల, కళాశాలలకు వెళ్లాల్సి వస్తుంది.

ఏళ్లుగా ఇబ్బందులు..

44వ జాతీహ రహదారి నిర్మాణం చేపట్టి దాదాపుగా పది సంవత్సరాలు అవుతోంది. రహదారి పక్కన గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలగకుండా సర్వీసు రోడ్లు నిర్మించాలి. కాని నేషనల్ హైవే ఆథారిటీ మాత్రం రోడ్ల నిర్మాణాల కోసం చర్యలు తీసుకోకుండా తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో ఆయా గ్రామాలకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సర్వీస్‌రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలి



దుబార్‌పేట్ వద్ద రెండేళ్ల కిందట నిర్మాణం పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– నాగరాజ్, దూబార్‌పెట్

పట్టించుకోవడం లేదు



సిరిచేల్మ ఫ్లైఓవర్ వద్ద సర్వీసు రోడ్డు నిర్మించాలి. గత కొన్నేళ్లుగా అధికారులకు విన్నవించినా.. రోడ్డు నిర్మాణం కోసం సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వీసు రోడ్డు లేక పోవడంతో చాలా ఇబ్బంది అవుతోంది.

– భవగన్, జామిడి

ఎమ్మెల్యేకు సన్మానం

ఖానాపూర్: కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌తోపాటు కాంగ్రెస్ సేవాదల్ సీనియర్ నాయకుడు రాజేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ఖానాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఖానాపూర్: మస్కాపూర్ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో మండలంలోని మస్కాపూర్‌లో సీజన్–1 క్రికెట్ టోర్నీని ఎస్సై లింబాద్రి ఆదివారం ప్రారంభించారు. యూఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టోర్నీని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు మధు, సన్ని, సాయి, గంగాధర్, రాజేందర్, ఆసిఫ్ తెలిపారు.